



సిఐటియు ఆధ్వర్యంలో ఈపీఎఫ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు



ఇంటి దొంగల పనే..!

ఇంజిన్ల మాయంలో సూత్రధారులు వారే

అసలు దొంగలు దొరికేరా..?

అరెస్టులతో కదులుతున్న డొంక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'కియా'లో ఇంజన్లను ఇంటి దొంగలే మాయం చేశారు. ఇందులో భాగస్వామ్యులైన ఎనిమిది మందిని బుధవారం నాడు కోర్టు ముందు పోలీసులు ప్రవేశపెట్టారు. మరికొంత మంది పట్టుబడాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు పట్టుబడిన వారి నుంచి చాలా వరకు సమచారాన్ని పోలీసులు స్వీకరించినట్టు సమాచారం. కోర్టులో ప్రవేశపెట్టాక జైలుకెళ్లిన వారిని మరోమారు కస్టడీకి తీసుకుని విచారించే అవకాశాలూ ఉన్నట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఐదేళ్లుగా ఇంజన్లను ఏ రకంగా మాయం చేశారు. ఎక్కడ వీటిని విక్రయించారు... మయమైన ఇంజన్లు ఎక్కడికెళ్లాయన్న యాంగిల్‌లో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

పాడుపడ్డాయని వెనక్కు పంపించే క్రమంలో మాయం

కియా పరిశ్రమలో కార్ల తయారీ కోసమని చెన్నైలోని హుందాయ్ కంపెనీల నుంచి కియా ఇంజన్లను కొనుగోలు చేస్తుంది. అక్కడి నుంచి ట్రాన్స్‌పోర్టులో ఇండెంట్ ప్రకారం ఇంజన్లు వస్తాయి. వచ్చిన ఇంజన్లలో ఇక్కడ తీసుకున్న తరువాత అందులో లోపాలున్నాయని వెనక్కు పంపించేందుకు ఆర్డర్ పెడుతారు. అలా వెళ్లే క్రమంలో డిస్పాచ్ విభాగంలో గోల్‌మాల్ చేయడం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో ప్రస్తుతం పనిచేస్తున్న వారు... గతంలో పనిచేసి వెళ్లిన వారు కూడా ఉన్నట్టు గుర్తించారు. ఈ రకంగా బయటకు తీసుకెళ్లిన ఇంజన్లను కొన్ని కార్ల మరమ్మతులు చేసే వారికి అమ్మగా, మరికొన్ని చెరుకు మిషన్లు, బోట్లకు వాడినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. పూర్తి స్థాయి సమాచారం రావాలంటే మరికొంత సమాచారాన్ని సేకరించాల్సినట్టు పోలీసులు భావిస్తున్నాయి. అసలు సూత్రధారులు ఇంకా పట్టుబడనట్టు తెలుస్తోంది. వారు కూడా పట్టుబడితే మొత్తం ఇంజన్ల దొంగతనం వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

అసలు సూత్రధారులు పట్టుబడితే పూర్తి వివరాలు బహిర్గతం

కియా ఇంజన్ల మాయం ఘటనలో ఇప్పుడు పట్టుబడిన వారిలో కీలక వ్యక్తులు కొంత మంది ఉన్నప్పటికీ మొత్తం వ్యవహారంలో మరింత కీలకంగా వ్యవహరించిన వారున్నట్టు తెలుస్తోంది. ఆ కీలక సూత్రధారులు పట్టుబడితే కియాలో ఇంజన్ల విభాగంలో జరిగిన దొంగతనం వ్యవహారం మొత్తం బయటకు వచ్చే అవకాశాలున్నాయి. అప్పుడు ఇంజన్ల దొంగతనం ఒక్కటేనా ఇంకా ఏవైనా ఇటువంటివి కియాలో చోటు చేసుకుంటున్నాయా అని కూడా బయటకొచ్చే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి అయితే 900 ఇంజన్లు దొంగతనంకు గురైనట్టు గుర్తించారు. వీటి విలువ కనీసం రూ.50 కోట్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. అసలు సూత్రధారులు పట్టుబడితే ఆ విలువ అంతే ఉంటుందా ఇంకా ఏమైనా ఉందా అన్నది కూడా బయటకు వచ్చే అవకాశాలున్నాయి.

వేతనాలు ఇచ్చాకే సమ్మె విరమణ

- కార్మికులపై అసత్య ఆరోపణలు చేయొద్దు
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు
- 12వ రోజుకు శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ డబ్బులను ఖాతాల్లో జమ చేసిన తర్వాతనే సమ్మెను విరమిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ స్పష్టం చేశారు. శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె గురువారం 12వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో తాగునీటి కార్మికులు అనంతపురం ఈపీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. మండుటెండను లెక్కచేయకుండా కార్మికులు కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ కార్మికులు చేసిన పనికి వేతనాలు అడుక్కునే దుస్థితి నెలకొనడం విచారకరం అన్నారు. ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి వేతనాల కోసం రోడ్లెక్కి ఆందోళన చేసే దుస్థితి ఉందన్నారు. అధికారులు మాత్రం కాంట్రాక్టర్లు చెల్లించాల్సి ఉంటుందని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఒక్కో కాంట్రాక్టర్ ఒక్కో విధంగా పిఎఫ్, వేతన బకాయిలు చెల్లించక ఇబ్బందులు పెట్టారని తెలిపారు. చాలా సందర్భాల్లో సమ్మె కాలపు ఒప్పందాలను ఎవరూ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. సమ్మె సందర్భంగా నీటి సమస్య ఎదురైనప్పుడు కార్మికులపై నిందను నెట్టేలా కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తుండడం తగదన్నారు. అసత్య ప్రచారాలు మాని కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేసేలా చూడాలన్నారు. పిఎఫ్ వేతనాలు బకాయి పెట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించేదాకా విధులకు హాజరయ్యేది లేదన్నారు. ప్రాజెక్టుల వారీగా కార్మికులకు బకాయి పెట్టిన కాంట్రాక్టర్లు శివారెడ్డి, కలాం నాయుడు, శివశంకర్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మూకుమ్మడికి పిఎఫ్ దరఖాస్తులను అధికారులకు అందజేశారు. స్పందించిన ఈపీఎఫ్ కార్యాలయ అధికారి పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, శ్రీ రామిరెడ్డి తాగునీటి కార్మికుల సంఘం అధ్యక్షులు ఎర్రిస్వామి, కార్యదర్శి జి.రాము, కోశాధికారి వన్నూరుస్వామి, మాజీ అధ్యక్షులు రామాంజి, కొండా రెడ్డి, అశోక్, గంగాధర, ప్రకాష్, సంజీవప్ప, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో అంబేద్కర్ చిత్రపటం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్



అంబేద్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న న్యాయవాదులు

పట్టణంలోని సివిల్ కోర్టులో గురువారం న్యాయమూర్తి సుభాన్ బహుజనుల లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది నారాయణప్ప ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతి కోర్టులో అంబేద్కర్, మహాత్మగాంధీ చిత్రపటాలను ఉంచి వారి సిద్ధాంతాలను నమ్ముతూ, ఆచరించాలన్నారు. వారి అడుగు జాడల్లో నడస్తున్న నారాయణప్ప ఆలోచనా విధానాలు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు దేవేంద్రప్ప, సంజీవయ్య, కరణం తిప్పేస్వామి, సంపత్ కుమార్, మల్లికార్జున, పట్టాభి, తదితరులు పాల్గొన్నారు..

ఏకలవ్య విగ్రహావిష్కరణకు ఆర్డీవోకు ఆహ్వానం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కంబదూరులోని పావగడ రోడ్డులో పాత పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ గురువారం ప్రజాసంఘాల నాయకులు ఆర్డీవో వసంతబాబును కోరారు. ఆర్డీవోను ఆహ్వానించిన వారిలో తిప్పానాయక్, ఆర్‌కె.రాజు, కంబదూరు మండల ఎరుకుల సేవా సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, మారెన్న, మారెప్ప ఉన్నారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ నుంచి స్వయం ఉపాధికై రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాలకు చెందిన 21–50 ఏళ్ల లోపు ఉండి బిపిఎల్ కార్డు కలిగి వున్న వ్యక్తులు మే 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాల న్నారు.

గ్యాస్, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యం లో పట్టణంలోని సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు గ్యాస్, విద్యుత్, అగ్ని ప్రమాదాలలు, నివారణ చర్యలను ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

రోడ్డు నిబంధనలు పాటిద్దాం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ నరేంద్ర కుమార్ సూచించారు. రోడ్డు ప్రమాదాలు, నివారణ చర్యల్లో భాగంగా గురువారం మండలం లోని నాగిరెడ్డిపల్లి మలుపు వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. చాలా సందర్భాల్లో మితిమీరిన వేగమే ప్రాణాలు తీస్తుందన్నారు.క్షేమంగా ఇంటికి వెళ్లాలంటే నిదానమే ప్రధానం అన్న దానిని మరవకూడదన్నారు. వాహనదారులకు పలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి

ఆదుకుంటాం : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని కదరంపల్లి గ్రామంలో మొక్కజొన్న పంట నష్టపోయిన రైతు కుమారస్వామిని ప్రభుత్వం తరఫున ఆదుకొంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. పంటనష్టంపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కదరంపల్లికి చెందిన రైతు గొల్ల కుమారస్వామి 9 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంట కోత దశలో ఉండగా గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దాదాపు ఐదెకరాల్లో పూర్తిగా అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంట రైతు కళ్ల ముందే కాలిపోవడం ఎంతగానో కలచి వేసిందన్నారు. రైతు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, తప్పక పరిహారం అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఆహుతైన మొక్కజొన్న పంట



అనంతపురం-బెంగళూరు రైలుకు గ్రీన్‌సిగ్నల్

అనంతపురం రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే మొట్టమొదటి రైలు



రైలు కోసం పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ అంబికా

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా ప్రజలు అనేక సంవత్సరాల కోరికకు భారత రైల్వే శాఖ స్పందించింది. శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం నుంచి బెంగళూరుకు నడుస్తున్న మెము రైలును అనంతపురం వరకు పొడిగిస్తూ కేంద్ర రైల్వే బోర్డు 2025 ఏప్రిల్ 15న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా ప్రజల సౌకర్యార్థం ఈ రైలును ఏర్పాటు చేయాలంటూ ఎంపీ అంబికా లక్ష్మినారాయణ పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో పాటు రైల్వే మంత్రి, రైల్వే అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీరన్న సోమన్నను వ్యక్తిగతంగా కలుసుకుని రైలు ఏర్పాటు అంశంపై మాట్లాడారు. ఈ మేరకు రైల్వే అధికారుల నుంచి అనంతపురం నుంచి రైలు బయలుదేరేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ రైలు అందుబాటులోకి వస్తే అనంతపురం నుంచి బెంగుళూరుకు ప్రయాణం చేసే ప్రయాణికులకు ఉపయోగంగా ఉటుంది. ఈ రైలు ఇప్పటి వరకు ఉన్న స్టాపేజ్‌తో పాటు సోమేశ్వర, విధురాశ్వర్థం, కొత్తచెరువు, బసంపల్లి, చిగిచెర్ల, జంగాలపల్లి, ప్రసన్నాయనపల్లి స్టేషన్లలో కూడా ఈ రైలు నిలబడుతుంది. రైలు అనంతపురం స్టేషన్ నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు బెంగళూరు స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ అతి త్వరలోనే కేంద్ర రైల్వే మంత్రి చేతుల మీదుగా అనంతపురం నుంచి రైలును ప్రారంభిస్తామని తెలియజేశారు.


ఇంటర్ విద్యార్థినులకు విప్ అభినందనలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అభినందించి, నగదు ప్రోత్సాహకం అందజేశారు. అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులను గురువారం కాలవ తన నివాసంలో ఘనంగా సత్కరించారు. కళాశాల టాపర్‌గా నిలిచిన ఎ.తస్లిమాకు రూ. 10వేల నగదు అందజేశారు. కళాశాల ప్రధానాచార్యులు దండు విజయభాస్కర్ మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థినులను ఎమ్మెల్యే సత్కరించడం హర్షణీయమన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. విద్యార్థిలు మాట్లాడుతూ తమ విజయానికి స్టడీ అవర్స్, యూనిట్, గ్రాండ్ టెస్టులు, వంద రోజుల సంకల్పం ప్రోగ్రాం, గురువులు, తల్లిదండ్రులే కారణమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నీరు పారక.. మురుగు కదలక..!

డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్త - ఇళ్ల ముందు కాలువల్లో అపరిశుభ్రత



మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో మురికి నీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అనేకచోట్ల ప్రధాన, చిన్న కాలువల్లో చెత్తాచెదారం నిల్వ ఉండి మురుగునీరు ముందుకు వెళ్లకుండా నిల్వ ఉంది. దుర్వాసన, దుర్గంధం, దోమల బెడద ప్రజలను పీడిస్తున్నాయి. పురపాలక సంఘం, మెప్మా విభాగం సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్త వేరువేరుగా చెత్త ట్రాక్టర్లకు అందించాలని చెప్పినప్పటికీ అన్నింటినీ కలిపి చెత్త కుండీలో వేస్తున్నారు. ప్లాస్టిక్ నీళ్ల బాటిల్లు, దుస్తుల వ్యర్థాలు, ప్లాస్టిక్ కాగితాలు మురికి కాలువలో ఉండి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉంటున్నాయి. పురపాలక సంఘానికి పారిశుధ్య విభాగానికి అవసరమైన సిబ్బంది లేరు. దీంతో ఫిర్యాదులు వచ్చిన చోట సిబ్బంది హాజరై అక్కడి కాలువల్లో పూడిపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. ఇటీవల చెత్త సేకరణకు అవసరమైన చెత్తకుండీలు, తోపుడు బండ్లు సుమారు 12 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి మరమ్మతులు చేయడం, మరికొన్ని కొత్తవాటిని మున్సిపాల్టీ కొనుగోలు చేసింది. అయితే సిబ్బంది కొరత వల్ల మురుగు కాలువల్లో చెత్తను తొలగించడం సాధ్యం కాలేదు. బళ్లారి రోడ్డు వద్ద గల కంపోస్ట్ యార్డ్ వివిధ కారణాల వల్ల చిన్నదై చెత్తను వేసేందుకు స్థలం చాలడం లేదు. ప్రతి ఏటా వేసవిలో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో పొగ మంటలు వ్యాపించి వాయు కాలుష్యం వల్ల సమీప కాలనీవాసులు ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి ప్రతిసారి వేసవిలో నెలకొంటుంది. పట్టణం అన్ని వైపులా అభివృద్ధి చెందడంతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కంపోస్టు యార్డును ఊరికి దూరంగా మరో చోట ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలంగా ప్రతిపాదన ఉన్నప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. చెత్త నుంచి సంపద సృష్టించే పథకం ఆచరణలో అమలుకు నోచలేదు. సరైన మురుగు నీటిపారుదల వ్యవస్థ లేకపోవడం వల్ల మురికి నీరు పట్టణం వెలుపల ముత్రాస్ కాలనీ వద్ద గల పొలాల వారు కూరగాయలను ఈ మురికి నీటితో సాగు చేస్తున్నారు. ఇక్కడ పండే విషపూరితమైన ఆకుకూరలు ప్రజలు సేవించి అనారోగ్యానికి గురి అవుతున్నారు. మరికొంత మురికి నీరు సమీపంలోని ఉడేగోళం వద్ద గల ఊట చెరువు చేరుతుంది. దీంతో చెరువులో నీరు కలుషితం అవుతున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో కురిసే వర్షపు నీరు పట్టణం వెలుపల వెళ్లేందుకు అవసరమైన కాలువ లేకపోగా జాతీయ రహదారి 544 డి నిర్మాణం సందర్భంగా రహదారి దిగువన తగిన కొలతలతో మురికి కాలువను నిర్మించకపోవడం వల్ల వర్షం వచ్చిన ప్రతిసారి పట్టణంలో పల్లపు ప్రాంతాలు జలమయం కావడం తప్పడం లేదు. దీనికి శాశ్వత పరిష్కారం ఇంతవరకు చూపలేదు.

చర్యలు తీసుకుంటున్నాం..
వి.దివాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్.

రాయదుర్గం పురపాలక సంఘంలో 110 కిలోమీటర్ల మేరకు మురికి కాలువలు ఉన్నాయి. వీటిలో పేరుకుపోయిన చెత్త చెదారం, పూడికను తొలగించేందుకు ఇటీవల టెండర్లు పిలిచాం. గత ఏడాది ప్రభుత్వం మురికి కాలువల్లో పూడిక తొలగింపునకు మంజూరు చేసిన రూ.22 లక్షలు నిధులతో మురికి కాలువలో పూడిక తొలగింపు పనులు ఈనెల 20వ తేదీ నుంచి చేపడతాం. వర్షాకాలం ఆరంభం అయ్యేలోగా 40, 50 రోజుల్లో పూడిక తీసివేత పనులు పూర్తి చేస్తాం. ఊరి బయట ప్రధాన మురికి కాలువలో జెసిబి సాయంతో చెత్తాచెదారం తొలగిస్తాం. మురికి కాలువల నిర్మాణానికి నిధులు కావాలని ఉన్నత అధికారులను కోరాం. శాశ్వత డంపింగ్ యార్డ్ కోసం మల్లాపురం లేఅవుట్ సమీపంలో 30 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఇదివరకే కోరాం. ఈ విషయంపై స్థానిక శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు కలెక్టర్‌కు లేఖ రాశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో, తహశీల్దార్ స్థల పరిశీలన చేస్తున్నారు. పట్టణం వెలుపల మురికి నీరు శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు 4.28 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని జిల్లా అధికారులను కోరాం. రోజుకు 10.7 మిలియన్ లీటర్ల మురికి నీరు శుద్ధి చేసే ట్రీట్మెంట్ ప్లాంట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తాం. పారిశుధ్య విభాగంలో అదనపు సిబ్బందిని నియమించాలని ఉన్నత అధికారులను కోరాం.

ప్రజాసమస్యలపై సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో నెలకొన్న తాగునీరు, వీధి దీపాల సమస్యలపై గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప తన ఛాంబర్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈదురుగాలులు, వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ కోతలు ఉండడంతో వీరాపురం నుంచి నీటి పంపింగ్ చేయడానికి ఆసల్యమవుతోందని, తద్వారా పట్టణంలో నీటి సరఫరా లో జాప్యం జరుగుతోందని అధికారులు తెలిపారు. దీంతో ఛైర్‌పర్సన్ విద్యుత్ సంస్థ ఎస్‌ఈ, ఎడిఈ, ఎఈలకు ఫోన్ చేసి మాట్లాడారు. వీరాపురం నీటి పంపింగ్‌కు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరగా ఎస్‌ఈ స్పందించి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. పట్టణంలో ఇకపై నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ డీఈఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈ నరసింహులును ఆదేశించారు. వార్డుల్లో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని వార్డు సభ్యులు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. వెలగని వీధి దీపాలను తొలగించి మరమ్మతులు చేసిన వీధి దీపాలను వెంటనే వేసి సభ్యులకు తెలపాలని ఏఈ ప్రతాప్‌కు సూచించారు. సమావేశంలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి పొరాలు శివ, గౌని శ్రీరామరెడ్డి, బషీర్, పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిపి పద్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు సమస్యలు ఏకరువు పెట్టారు. అధికారులు మండలానికి మంజూరైన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. సీసీ రోడ్లు వేసినా నిధులు మంజూరు కాలేదని, గౌనూరు, ఖానాపురం, ఏలంజి, నేమకల్లు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. గృహాలు నిర్మించి రెండేళ్ల పూర్తయినా బిల్లులు అందలేదని కొందరు సభ్యులు వాపోయారు. ఏలంజి, బొల్లనగుడ్డం, గోవిందవాడ, బొమ్మనహాల్, తదితర గ్రామాల్లో వర్షాలు వస్తే రహదారులపై నీరు నిలుస్తున్నాయని తెలిపారు. నూతన గృహాల కోసం 1600 అర్జీలు అందాయని గృహ నిర్మాణశాఖ అధికారులు తెలిపారు. మండలంలో 30 దాకా పశువుల షెడ్లు నిర్మించామని బిల్లులు అందలేదని కొందరు తెలిపారు. అంగన్వాడీ భవనాలు శిథిలావస్థకు చేరాయని ఐసిడిఎస్ అధికారిణి తెలిపారు. 3వేల మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నా 2 నెలల నుంచి బిల్లులు అందలేదని సభ దృష్టికి తెచ్చారు. అకాల వర్షాలకు 1100 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని నివేదిక తయారు చేసినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. వెలుగు సంఘాల్లో శ్రీనిధి, బ్యాంకు రుణాల వసూలు పూర్తిస్థాయిలో లేదని, వసూలుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని వెలుగు సిబ్బంది కోరారు. సభకు గైర్హాజరైన ఆర్‌డబ్ల్యుఎస్, ఐసిడిఎస్ అధికారి, ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా మండలంలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని, గ్రామాల్లో ఓఆర్ఎస్ పాకెట్లు సరఫరా చేయాలని, ఉపాధి కూలీలకు ప్రథమ చికిత్స చేయాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, తహశీల్దార్ మునివేలు, ఎంఇఒలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి -కణేకల్లు

ప్రతి అంగన్వాడీ కేంద్రంలో 'పోషణ పక్వాడ' కార్యక్రమం నిర్వహించాలని సిడిపిఒ లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని మూడో అంగన్వాడీ కేంద్రంలో గురువారం సిడిపిఒ ఆధ్వర్యంలో 'పోషణ పక్వాడ' కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 22వ తేదీ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు పిల్లల తల్లులకు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ గీత, అంగన్వాడీ వర్కర్ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో ప్రయోజనం

ఓటిపిఆర్ఐ డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఫార్మసీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని జెఎన్‌టియు ఓటిపిఆర్ఐ డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి తెలియజేశారు. గురువారం స్థానిక జెఎన్‌టియుఎ అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థలో 2021 బీఫార్మసీ బ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని 2022 ఈ ఫార్మసీ బ్యాచ్ విద్యార్థులు నిర్వహించారు. ఒటిపిఆర్ఐ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.గోపీనాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జివి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో పోటీకి అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సి.గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగతపరమైన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్‌తో పాటు బోధన, బోధనేతత పొరుగు సేవల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫేర్‌వెల్ డే కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బారెడ్డి తదితరులు



వాహనానికి చెత్తను అందజేస్తున్న బాలుడు

బాలుడి చి(చె)త్త శుద్ధి


అనంతపురం సిటీ : స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అంటూ ప్రజలు భాగస్వామ్యం కావాలని ప్రభుత్వం చాటుతోంది... నగర పౌరులందరూ పారిశుధ్యం కోసం స్వచ్ఛందంగా బాధ్యత వహించాలని ప్రభుత్వాలు చెబుతున్నా.. వినేవారు లేరు.. ఇలాంటి పరిస్థితుల్లో ఓ చిన్నారి స్వచ్ఛందంగా ఇంట్లో నుంచి చెత్త తీసుకొచ్చి చెత్త వాహనానికి అందజేసిన ఘటన చూపరులను ఆకట్టుకుంది. అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ ఎక్స్టెన్షన్ ప్రాంతంలో ఇళ్ల నుంచి చెత్తను తీసుకెళ్లేందుకు 'అమ్మా.. చెత్త వాహనం వచ్చింది..' అంటూ వచ్చింది. ఈ శబ్దం వినగానే ఓ ఇంట్లో నుంచి మూడేళ్ల పిల్లాడు అత్యంత ఉత్సాహంతో చెత్త బుట్టను తీసుకొచ్చి వాహనంలోని వ్యక్తికి అప్పగించాడు. ఇది చూసిన పారిశుధ్య కార్మికులు, చుట్టుపక్కల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదు

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ రెగ్యులర్ కార్మికుల సమస్యలపైన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరించడం తగదని సిఐటియు నగర కార్యదర్శులు ముత్తుజ వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సాకే నాగరాజు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ రెగ్యులర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికుల బకాయి సరెండర్ లీవ్‌లు అమలు చేయకపోగా డిఎలు, ఇంక్రిమెంట్లు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు చెప్పిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జిపిఎఫ్ అకౌంట్లు ఓపెన్ చేయాలన్నారు. ముఖ్యంగా అనంతపురం నగరపాలక సంస్థలో గతంలో 500 మంది పని చేయాల్సిన చోట కేవలం 135 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. 300 మందికిపైగా ఉద్యోగ విరమణ పొందినా తర్వాత ఖాళీలను భర్తీ చేయలేదన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి సరెండర్ లీవులు, డిఎలు, ఇంక్రిమెంట్లు, కార్మికుల సంఖ్య పెంచాలని, సకాలంలో రెగ్యులర్ కార్మికులకు రావాల్సిన యూనిఫారంతోపాటు కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, పనిముట్లు అందజేయాలని కోరారు. ఆయా సమస్యలపై కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ ట్రెజరర్ నారాయణస్వామి, కమిటీ సభ్యులు ఆనంద్, నారాయణస్వామి, శ్రీనివాస్‌మూర్తి, పుల్లన్న, మల్లేష్, మరియమ్మ, కౌసల్య, ముత్యాలమ్మ, అంజనమ్మ, గంగాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

గ్రామీణాభివృద్ధికి సహకరించాలని వినతి

అనంతపురం కార్పొరేషన్ : గ్రామాల అభివృద్ధికి గ్రాంట్‌ల పరిధిని పెంచి సహకరించాలని అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ టిసి వరుణ్ కోరారు. గురువారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన 16వ ఫైనాన్స్ కమిషన్ సమావేశంలో 16వ ఆర్థిక సంఘం కమిషన్ ఛైర్మన్ అరవింద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిసి వరుణ్ మాట్లాడుతూ పరోక్ష పన్నులను అధిగమించి ప్రత్యక్ష పన్నులు, జీఎస్టీ రాబడులు మరింత ఊపందుకోవడంతో ఆయా పన్నులు మరింతగా పెరుగుతున్నందున, కేంద్ర పన్నుల విభజన పూల్‌లో 6శాతానికి సమానమైన గ్రాంట్‌లను స్థానిక సంస్థలకు సిఫార్సు చేయాలని 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. సిఫార్సు చేసిన గ్రాంట్ల పెరుగుదల గ్రామీణ స్థానిక సంస్థలు నాణ్యమైన ప్రాథమిక సేవలను అందించడానికి, క్లిష్టమైన మౌలిక సదుపాయాలను నిర్వహించడానికి వారి రాజ్యాంగ ఆదేశాన్ని నెరవేర్చడానికి వీలు కల్పిస్తుందన్నారు. అలాగే ఉపాధి హామీ పథకానికి అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి ర్యాంకర్‌కు అభినందన

గుంతకల్లు : ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని షబానాజ్‌కు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ల్యాప్‌టాప్ అందజేశారు. గురువారం పట్టణంలోని 25వ వార్డులో ఉన్న విద్యార్థిని స్వగృహానికి ఎమ్మెల్యే స్వయానా వెళ్లి ల్యాప్‌టాప్ బహుమతిగా అందజేసి సన్మానించారు. ఇందులో భాగంగా భవిష్యత్తులో ఏం సాధించాలని విద్యార్థిని షబానాజ్‌ను ప్రశ్నించగా తాను ఎంబిబిఎస్ చదివి ఆపై కలెక్టర్ గా అవ్వాలని ఉందని తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ మున్ముందు అనుకున్న లక్ష్యాలను చేరుకుని ఉన్నతంగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, టిడిపి పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మైనారిటీ నాయకులు గుజిరీ ఖాజా, పూల మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్‌కు ఆర్థికసాయం

రాప్తాడు : రాప్తాడు పిహెచ్‌సిలో ఉన్న చిన్మయనగర్ సచివాలయం పరిధిలో పని చేస్తున్న ఆశావర్కర్ వీరమ్మ కుటుంబానికి సిబ్బంది గురువారం రూ.26,500 ఆర్థికసాయం అందజేశారు. పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్‌ఎంఎస్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఆశాలందరూ కలిపి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆకుల ఆంజనేయులును కలిసిన శమంతకమణి

నార్పల : అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రంలోని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఆకుల ఆంజనేయులును మాజీ మంత్రి శమంతకమణి గురువారం పరామర్శించారు. ఆంజనేయులు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న శమంతకమణి తన కుమారుడు అశోక్‌తో కలిసి నార్పలకు వచ్చి పరామర్శించారు. అనంతరం యోగక్షేమాలను భార్య, మాజీ ఎంపిపి ఆకుల అరుణమ్మను అడిగి తెలుసుకున్నారు.

పట్టుచీరపై ఎమ్మెల్యే శ్రావణిశ్రీ చిత్రం



పట్టుచీరను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

శింగనమల : ధర్మవరానికి చెందిన అభిమానులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి పట్టుచీరపై తన చిత్రపటానికి వేయించి బహుమతిగా అందించారు. ధర్మవరం చేనేత కార్మికులు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ చిత్రాని ప్రతిబింబించేలా అందంగా పట్టుచీరను తయారు చేశారు. ఈ పట్టుచీరను గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభిమానులు అందజేశారు. దీంతో ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. తర్వాత చీరను నేసిన చేనేత కార్మికులను ఫోన్‌లో అభినందించడంతోపాటు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ :

నగరంలోని సప్తగిరి సర్కిల్లో ఉన్న టౌన్ కాంగ్రిగేషనల్ చర్చి (ఎస్ఐయుసి) ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పాస్టర్ సంపత్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి ప్రతినిధి తిప్పేస్వామి, వ్యవసాయ శాఖ విశ్రాంత ఉద్యోగి కృష్ణమూర్తి, సంఘ సభ్యులు విల్సన్, విక్టర్, విజయ్‌కుమార్, ఫ్రాన్సిస్, చంద్రలీల, తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో కొత్తహంగులకు శ్రీకారం

పర్యాటకుల కోసం ప్రత్యేక సౌకర్యాలు-బ్యాటరీ కారు ప్రారంభించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని శిల్పారామంలో కొత్తహంగులు సంతరించుకుంటున్నాయి. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో పర్యాటకులను ఆకర్షించే పలు కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన బ్యాటరీ కారును ఎమ్మెల్యే దగ్గుపాటి గురువారం ప్రారంభించారు. అనంతరం టిడిపి నాయకులు, పర్యాటక శాఖ అధికారులతో కలిసి కారులో పార్కులో కలియతిరిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిల్పారామం మొత్తం చూసేందుకు ప్రజల సౌకర్యవంతంగా ఉండటంతోపాటు చిన్న పిల్లలకు వినోదం, ఫొటో షూట్ కోసం బ్యాటరీ కారు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులు, కొత్త బోర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొత్త మరుగుదొడ్లు నిర్మించాలని, పెడల్ బోటింగ్‌ను ప్రారంభించాలని ఆదేశించారు. ఇక్కడికి వచ్చే ప్రతిఒక్కరికీ ఆహ్లాదాన్ని పంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఎఒ శివప్రసాద్, టిడిపి నాయకులు డాక్టర్ హరిప్రసాద్, సాదిక్, దాదాపీర్, బాబు, ధనమూర్తి, లింగమయ్య, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, వెంకటేశ్వర్‌రెడ్డి, నెట్టెం బాలకృష్ణ, మహిళ నాయకురాలు వడ్డే భవాని, శోభ, రమీజా, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



బ్యాటరీ కారును నడుపుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

స్థల సేకరణను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనంతపురం రూరల్ మండల పరిధిలో పేదలకు పట్టాలు ఇచ్చేందుకు స్థల సేకరణను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో అనంతపురం రూరల్ మండల తహశీల్దార్ మోహన్‌కుమార్‌తోపాటు హౌసింగ్ డిఇతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రూరల్ మండల పరిధిలో ఇళ్ల స్థలాలు లేని వారు ఎంత మంది ఉన్నారు.. వారికి ఎంత మేర స్థలం అవసరమన్నది ఆరా తీశారు. ఈ సందర్భంగా గతంలో పలు హౌసింగ్ లేఔట్లలో కొందరు ఎలాంటి అర్హత లేకున్నా ఇళ్ల పట్టాలు తీసుకున్నారని, వారిలో కొందరు ఇంటి నిర్మాణాలు చేపట్టలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాంటి వాటిని గుర్తించి ఇళ్ల పట్టాలు రద్దు చేస్తామన్నారు. దీంతోపాటు పలు గ్రామాల పరిధిలో మొత్తం 30ఎకరాల వరకు సేకరించినట్టు వివరించారు. అర్హులందరికీ ఇళ్లపట్టాతోపాటు ఇళ్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఎవరికేం చెప్పినా చేయరు.. ఏం పని చేస్తున్నట్టు..?!

అధికారులపై మేయర్ అసంతృప్తి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ చేసినా రోడ్లు గుంతలమయంగా మారాయి.. ప్యాచ్‌వర్క్‌లు సరిగా జరగలేదు.. పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది... ఎవరికి ఏం చెబుతున్నా పని చేయడం లేదు.. మరి ఏం పని చేస్తున్నారు..' అంటూ మేయర్ మహమ్మద్ వసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తన ఛాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా కంపోస్ట్ యార్డులో బయో మైనింగ్ చేయడానికి తమిళనాడు రాష్ట్రం కుంభకోణానికి చెందిన జిగ్మ సంస్థ వచ్చిందని అధికారులు తెలిపారు. ఇందుకు మేయర్ స్పందిస్తూ కంపోస్టు యార్డులో అవినీతి జరిగిందన్న విమర్శలు వస్తున్నందున ఎందుకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. ఇందుకు ఇఇ షాకీర్ హుస్సేన్ స్పందిస్తూ కర్నూలుల్లో ప్రత్యామ్నాయ స్థలం చూపటంతో బయోమైనింగ్ ప్రక్రియ సులువుగా సాగిందన్నారు. జిగ్మా సంస్థకు మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని, విజయవాడలో పది రోజుల కాలవ్యవధిలోనే కంపోస్ట్ యార్డ్లో చెత్త నిర్మూలన ప్రక్రియ ముగించారని, వారి పనితీరు చూసి కంపోస్ట్ పనులు అప్పగించిందని వివరించారు. అలాగే ఇటీవల పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేపట్టారని, అయితే గాలివాన కారణంగా కరెంటు సరఫరా నిలిచిపోవడంతో కొంత సాంకేతిక సమస్య ఏర్పడిందన్నారు. అయితే నగరంలో తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్న అంశంపై మాత్రం సమావేశంలో జవాబు లభించని పరిస్థితి నెలకొంది. నగరంలో గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నగరంలో కుక్కల బెడదను నివారించడానికి చేపట్టిన కుక్కల పట్టివేత ఆపరేషన్ పనులపై మేయర్ ఆరాతీశారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఇఇలు షాకీర్‌హుస్సేన్, నరసింహ, బిఇఎ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

ఎమ్మెల్యే జయరామ్‌ను కలిసిన ఆర్‌పిలు

పామిడి : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను స్వగృహంలో పామిడికి చెందిన ఆర్‌పిలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిలు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవ, కరూరు శివశంకర్, అప్పన్నగారి కుమార్, రఘునాథ్‌రెడ్డి, జాఫర్‌సాబ్, ప్రతాప్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల పక్షపాతి సిఎం చంద్రబాబు

అనంతపురం : దళితుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు అని అనంతపురం అర్బన్ టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో గురువారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వన్నూరప్ప, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి అన్నారు. ఎందుకంటే వర్గీకరణ ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలపడమే ఇందుకు నిదర్శనమన్నారు. సిఎం చేసిన మంచిని ఎస్సీ సామాజిక వర్గం ఎప్పటికీ మరువదన్నారు. తామంతా ఎప్పటికీ చంద్రబాబు వెంటే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శివ, తెలుగు యువత జిల్లా కార్యదర్శి రుషివర్ధన్, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు కదిరప్ప, హరికృష్ణ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు అడ్డగింత

యాడికి : మండల కేంద్రంలో కోన రోడ్డు కూడలిలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు గురువారం ఆర్టీసీ బస్సును అడ్డగించి నిరసన తెలిపారు. కొద్ది రోజుల నుంచి కోన రోడ్డులోని ప్రయివేటు పాఠశాల వద్ద ఉన్న బస్టాప్‌లో విద్యార్థుల ఆపినా ఆపకుండా వెళ్లేవారు. ఈనేపథ్యంలో ఆగ్రహించిన తల్లిదండ్రులు ఆర్టీసీ బస్సును అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో గంటపాటు రాకపోకలకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకూ పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఆర్టీసీ డ్రైవర్‌తో చర్చించి విద్యార్థులను బస్సులోకి ఎక్కించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-ఉరవకొండ

సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వజ్రకరూరు పిహెచ్‌సి వైద్యాధికారి ఎన్.సర్దార్‌వలి సూచించారు. తహశీల్దార్ నయాజ్‌అహ్మద్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో మజ్జిగతోపాటు ఓఆర్‌ఎస్‌ను నీటిలో కలుపుకుని తాగాలని సూచించారు. అనంతరం గ్రామంలో వజ్రకరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని ఆరు టీములుగా విభజించి ఒక్కొక్క టీంలో నలుగురు సభ్యులు చొప్పున ఏర్పాటు చేసి ఫైలేరియా సర్వే చేయించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి దామోదర్‌రెడ్డి, మండల ఆరోగ్య విస్తరణాధికారి పి.గురుప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సిహెచ్ఒ లక్ష్మీదేవి, హెల్త్ సూపర్‌వైజర్లు బి.నాగశంకర్, ఎం.సుశీల, ఎంఎల్‌హెచ్‌పిలు భారతి, నిర్మల, ల్యాబ్ టెక్నీషియన్ వై.లలిత, ఎఎన్‌ఎంలు సుకన్య, మౌనిక, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్లు రమేష్, బాబావలి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత దేశ రాజకీయతత్వ వేత్త, రాజనీతిజ్ఞుడు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ అని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా కొనియాడారు. రాధాకృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది రామాంజమ్మ, ఇందిరా, కావేరి, శ్రీ విజయ, హేమమాలిని, ముత్యాలమ్మ, బాషా, కిరణ్, మల్లికార్జున, నాగభూషణం, బాలచందర్ పాఠకులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : కమలానగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో తెలుగు వెలుగు సాహిత్య, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.దామోదర్‌రెడ్డి, కళ్యాణదుర్గం అధ్యాపకులు టీఎస్ శ్యాంప్రసాద్, చార్వి సాఫ్ట్‌వేర్ ఇన్స్టిట్యూట్ కో ఆర్డినేటర్ రేవంత్, తెలుగు వెలుగు అధ్యక్షులు టివి రెడ్డి, సిబ్బంది వెంకటేష్, వెంకన్న పాల్గొన్నారు.

గుత్తి : మానవతావాది డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అదనపు కార్యదర్శి జేన్నే కుల్లాయిబాబు, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, షేక్షావలి, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, దేవదాస్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఫ్రిజ్ ఏర్పాటు

నార్పల : శివక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి ఆధ్వర్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో చలివేంద్రం (ఫ్రిజ్) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు గౌరవాధ్యక్షులు మెల్లంపూటి సూర్యప్రకాష్ మాట్లాడుతూ శివక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాదాపు 15ఏళ్లగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే బస్టాండ్ వద్ద ఫ్రిజ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, రంగాపురం సర్పంచు కుళ్లాయప్ప, సామాజిక సేవకులు లగినేని నాగరాజు, బాబా ఫకృద్దీన్, వెంకటనారాయణ, బలిజ సంఘం అధ్యక్షులు ఇండ్ల రంగనాథ్, శివప్రసాద్, నాగరాజు, పెద్దన్న, బాబావలి, సూరి, షబ్బీర్, రమేష్, దిలీప్, ముత్తు పాల్గొన్నారు.

వర్గీకరణకు కేబినెట్ ఆమోదం చారిత్రాత్మకం

శింగనమల : ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం సామాజిక న్యాయానికి చారిత్రాత్మక ముందడుగు అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం అనంతపురంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న దళిత వర్గాలు పోరాడుతున్న తీరును గమణించిన సిఎం చంద్రబాబు ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా మంత్రుల కమిటీ సిఫారసులతో ఆమోదం తెలపడం సంతోషంగా ఉందన్నారు. 200 పాయింట్ల రోస్టర్ విధానం ప్రకారం రిజర్వేషన్లు సమానంగా పొందేలా చర్యలు చేపట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇది దళితుల ఆత్మగౌరవాన్ని పెంపొందించే నిర్ణయమని, ప్రజలందరూ స్వాగతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

కరువు సాయం ఏదీ..?

మండల మీట్‌లో జడ్పిటిసి డిమాండ్



సమావేశంలో ప్రగతిని వివరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నార్పల

నార్పలను కరువు మండలంగా ప్రకటించినా ఇంత వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని మండల అధ్యక్షులు నాగేశ్వరరావు ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భాస్కర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా జడ్పిటిసి నాగరత్నమ్మ మాట్లాడుతూ నార్పలను అత్యంత కరువు మండలంగా ప్రకటించినా ఇంత వరకూ ఎలాంటి సాయం అందలేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిపి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఎంపిటిసి శంకర్‌యాదవ్ మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ చట్టంపై చోటు చేసుకున్న అవకతవకలపై నిష్పక్షపాత విచారించి కూలీలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం అధికారులు మూడు నెలల్లో శాఖల వారీగా అభివృద్ధి నివేదికలను చదివి వివరించారు. ఈ సమావేశంలో ఎంఇఒ కృష్ణయ్య, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జ్యోతిరాణి, కార్యాలయ పర్యవేక్షణ అధికారి ఉమాదేవి, ఎపిఒలు ఎర్రమ్మ, రమేష్ రామారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్, సిడిపిఒ భారతి, మండల వ్యవసాయాధికారి చెన్న వీరస్వామి, ఉప ఉద్యాన అధికారి హరిచరణ్‌రెడ్డి ఎంపిటిసిలు పద్మాకర్‌రెడ్డి, రాజారెడ్డి, కాటమయ్య, బయపురెడ్డి, శారద, శివమ్మ, రమాదేవి, సర్పంచులు రామాంజనేయులు, రామ్‌భూపాల్‌రెడ్డి, కుళ్లాయిరెడ్డి, రమణకుమరి, కుళ్లాయప్ప, స్వప్న, లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని చైతన్య స్కూల్ టవర్‌క్లాక్ బ్రాంచిలో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎడిఎఫ్ఒ కెపి లింగమయ్య డెమో ద్వారా వివరించారు. మొదటగా అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే పొగ గదుల్లో చిక్కుకున్న వారిని ఏ విధంగా రక్షించాలి, పై అంతస్తుల నుంచి కిందికి ఎరాక్యులేషన్ ద్వారా తొక్కిసలాట లేకుండా ప్రజలు అప్రమత్తంగా వచ్చే విధంగా ఉండే రెస్క్యూ మెథడ్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే గ్యాస్ ఫైర్ జరిగితే సిఒ 2 ద్వారా ఏవిధంగా వాటిని ఎలా నివారించవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, మేనేజర్ గోపాల్, ఎల్ఎఫ్‌లు జి.గోవిందరాజులు, ఎస్.రమేష్‌కుమార్‌రెడ్డి, డిఒపి సురేష్‌గౌడ్, ఎఫ్ఎంలు సి.మధుసూదన్, వై.ఒబిరెడ్డి, జి.శ్రావణకుమార్, జి.తిప్పేస్వామి, కె.జయరాముడు, కె.అనిల్‌కుమార్, బి.సుధాకర్, ఎం.రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నగరంలోని రామ్ నగర్‌లో ఉన్న సిరి హైట్స్ అపార్ట్మెంట్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్యాస్ లీకైనా, ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరిగినా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలనే విషయాలపై వివరించారు. ఒకవేళ అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే ఫోన్ నెంబర్లు 101, 08554-220299, 9963739592కు సమాచారం అందించాలన్నారు.

ఉరవకొండ : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక సిబ్బంది సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పై అంతస్తు భవనాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రాణాలను ఎలా కాపాడాలో సూచనలు, సలహాలు ఇచ్చారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సిడిపిఒ విఎన్ శ్రీదేవి

ప్రజాశక్తి-ఉరవకొండ

అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఉరవకొండ ప్రాజెక్ట్ సిడిపిఒ బిఎన్ శ్రీదేవి సూచించారు. గురువారం విడపనకల్ మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒతోపాటు సర్పంచు తిమ్మరాజు మాట్లాడుతూ తల్లులకు వారి స్వీయ ఆరోగ్య స్థితి తెలుసుకోవడం, పిల్లల పెరుగుదల పురోగతి పర్యవేక్షణపై తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఒ యల్లమ్మ, సర్పంచు తిమ్మరాజు, సూపర్‌వైజర్ ఉమారాణి, హసీనా, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని పాల్యం తండా గ్రామంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పోషకాహారంపై బాలింతలు, గర్భిణులు, పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, లక్ష్మీదేవి, గర్భిణులు, బాధితులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పామిడి : మండల పరిధిలోని జాతీయ రహదారి 44లో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం వద్ద కల్వర్టును ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. సిఐ యుగంధర్ తెలిపిన వివరాల మేరకు.. అనంతపురంలోని అశోక్‌నగర్‌కు చెందిన సుమంత్ (26) ద్విచక్ర వాహనంలో గుత్తి నుంచి అనంతపురం వెళ్తుండగా పామిడి అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు రాగానే కల్వర్టును ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సిఐ తెలిపారు.

రాయి పడి టిడిపి కార్యకర్త మృతి

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త దళిత వేణు బుధవారం రాత్రి ఇంటి బయట నిద్రించాడు. వర్షం వస్తే ఇల్లు కారకుండా ఇంటిపైన టార్పాలిన్ షీట్ పరిచిపై దానిపై బండరాయి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో వీచిన బీభత్సమైన గాలి దెబ్బకు ఆ రాయి వేణు తలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి..

రాయదుర్గం రూరల్ : మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన రైతు కావలి ఎర్రిస్వామి(54) వ్యవసాయ తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజులు బిగించడానికి వెళ్లి షాక్‌కు గురై అడికక్కడే మృతి చెందాడు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాయదుర్గం అర్బన్ సిఐ జయానాయక్ తెలిపిన వివరాలు.. పూజారి బద్రీనాథ్ తోటలో వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు వేయడానికి వెళ్లిన ఎర్రిస్వామి ప్రమాదవశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి షాక్‌కు గురై మృతి చెందాడు. అతడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సిఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.